సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం। 12। జూన్। 2023



మరణంలోనూ వీడని బంధం
మామిళ్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. వారి పిల్లలు అనాథలుగా మారారు. 8లో



అడుగంటిన టీబీ డ్యాం
తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. ప్రస్తుతం జలాశయంలో నీటినిల్వ 5 టీంఎంసీలకు చేరింది. 8లో

గరిష్టం/కనిష్టం
37.8°/21.6°
జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు అధికంగా నెలకొంది. తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



ప్రశాంతి నిలయం: మోడల్ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశానికి ఆదివారం జిల్లా వ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా సాగిందని ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ పరీక్ష జరిగిందన్నారు. 1,028 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 853 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా త్వరలో అడ్మిషన్లు చేపడతామని ఆయన తెలిపారు.

మూల్యాంకనానికి గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు

ప్రశాంతి నిలయం: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనానికి కేటాయించిన ఉపాధ్యాయులు హాజరుకాకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 13, 14 తేదీల్లో కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం జరుగుతుందన్నారు. స్పాట్ వాల్యుయేషన్ విధులకు సిబ్బందిని నియమించుకుని, వారికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా రిలీవ్ చేయాలని ఆదేశించారు.

ఊరిస్తోన్న 'నైరుతి' మేఘాలు



కమ్ముకున్న దట్టమైన మేఘాలు

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు (సౌత్‌వెస్ట్ మాన్‌సూన్) దోబూచులాడుతున్నాయి. నాలుగు రోజులుగా సాయంత్రం వేళ దట్టమైన మేఘాలు కమ్ముకుంటూ ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఏటా జూన్ 1న కేరళను తాకే నైరుతి ఈసారి కాస్త ఆలస్యంగా 8వ తేదీన ప్రవేశించి కేరళ, తమిళనాడు, గోవా, కర్ణాటక, పుదుచ్చేరిలోని చాలా ప్రాంతాలకు విస్తరిస్తూ అలా ముందుకు సాగుతున్నట్లు వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) విడుదల చేసిన ఛాయాచిత్రం స్పష్టం చేస్తోంది.అయితే గతంలో తొలుత అనంతపురం జిల్లాను తాకిన తర్వాతనే రాష్ట్రమంతటా విస్తరించేవని చెబుతున్నారు. ఈసారి మొదట నెల్లూరును తాకడం విశేషం. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోకి ప్రవేశించడానికి ఇంకా రెండు మూడు రోజుల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

సజావుగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో టీచర్లతో మాట్లాడుతున్న అనంతపురం డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: ప్రభుత్వ టీచర్ల బదిలీల్లో ఆదివారం పండిట్లు, పీఈటీల కౌన్సెలింగ్ సజావుగా జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ అధ్యక్షతన అనంతపురం సైన్స్ సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొత్తం 142 మంది టీచర్లను బదిలీ చేశారు. వీరిలో 90 మంది తెలుగు పండిట్లు, 15 మంది హిందీ పండిట్లు, 9 మంది ఉర్దూ పండిట్లు, కన్నడ ఒకరు, పీఈటీలు 27 మంది ఉన్నారు. రాత్రి 10 గంటలకు ఈ ప్రక్రియ ముగిసింది.

2,475 మంది ఎస్జీటీల బదిలీ

టీచర్ల బదిలీల్లో చివరి అంకమైన ఎస్జీటీల బదిలీ ఉత్తర్వులు ఆదివారం సాయంత్రం జారీ చేశారు. జిల్లాలో మొత్తం 3,750 మంది ఎస్జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తప్పనిసరి, రిక్వెస్ట్ కలిపి 2,475 మందిని బదిలీ చేశారు. తక్కిన 1,275 మందిని రిటైన్ (పాతస్థానాల కేటాయింపు) చేశారు. బదిలీ అయిన వారందరూ సోమవారం కొత్త స్కూళ్లలో చేరాలని డీఈఓ ఆదేశించారు. ఎట్టకేలకు షెడ్యూలు ప్రకారమే బదిలీల ప్రక్రియ ముగిసింది. డీఈఓ ప్రత్యేక దృష్టి సారించడంతో ఏ చిన్న సమస్యా ఉత్పన్నం కాకుండా ప్రశాంతంగా ముగిశాయి. సహకరించిన ఉపాధ్యాయులు, కీలకంగా పనిచేసిన డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, కార్యాలయ సిబ్బందిని డీఈఓ అభినందించారు.

ఇక.. బడిబాట



- ముగిసిన వేసవి సెలవులు
- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- ఎండ తీవ్రత దృష్ట్యా ఈనెల 17 వరకూ ఒంటి పూట బడులు
- తొలి రోజే 'జగనన్న విద్యాకానుక' కిట్ల పంపిణీకి చర్యలు

ప్రశాంతి నిలయం: వేసవి సెలవులు ముగిశాయి. సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు బడి బాట పట్టనున్నారు. ఈ క్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజుల నుంచి పాఠశాలల గదులు, ఆవరణలు శుభ్రం చేయించారు.

17 వరకూ ఒంటి పూట బడి..

జూన్ వచ్చినా.. ఈ ఏడాది ఎండల తీవ్రత తగ్గలేదు. ఈ నెల 17 వరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు ఎండల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. 17వ తేదీ వరకూ ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాఠశాలలు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 వరకే నడవనున్నాయి. 11.30 వరకు తరగతులు నిర్వహించి, ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్య విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తారు. జూన్ 19 నుంచి షెడ్యూల్ ప్రకారం పాఠశాలలు నడుస్తాయి.

నేడు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ..

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పిల్లలందరూ బాగా చదువుకోవాలన్న లక్ష్యంతో బడి తెరిచిన రోజే విద్యా సామగ్రి అందించాలని సంకల్పించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 2,089 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే 1,56,976 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మూడు యూనిఫాంలకు సరిపడా దుస్తులు, బెల్టు, షూలు, పుస్తకాల బ్యాగ్, రెండు రకాల డిక్షనరీలు, వర్కు బుక్కులు, టెక్స్ట్ బుక్కులు, నోటు పుస్తకాలు కలిపి 9 రకాల వస్తువులను ఒక కిట్టుగా ప్రతి విద్యార్థికీ అందివ్వనున్నారు. ఒక్కో విద్యార్థికి అందించే విద్యాకానుక కిట్టు విలువ రూ.2,500 కాగా, జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,56,976 మంది విద్యార్థులకు రూ.39.24 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ ఏడాది విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉండేలా యూనిఫాం డిజైన్‌ను రూపొందించారు. బాలికలకు ముదురు లావెండర్ రంగులో గౌను, లావెండర్ రంగులో చెక్స్‌తో టాప్ అందిస్తారు. బాలురకు ముదురు నీలంపై నల్ల రంగు చెక్స్ చొక్కా, డార్క్ మిడ్‌నైట్ బ్లూ రంగులో ప్యాంట్ లేదా నిక్కరు అందనుంది. ఒకటి నుంచి 7వ తరగతి వరకూ బాలురకు హాఫ్ హ్యాండ్ చొక్కా, నిక్కరు, 8,9,10 తరగతులు విద్యార్థులు హాఫ్ హ్యాండ్ చొక్కా, ప్యాంట్ ధరించాలి. 1, 2 తరగతులకు బాలికలు హాఫ్ హ్యాండ్ చొక్కా, గౌన్, 3,4,5 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు- హాఫ్ హ్యాండ్ చొక్కా, స్కర్టు, 6 నుంచి 10 వరకు చున్నీతో చుడీదార్ అందిస్తారు.



జగనన్న కిట్‌లో ఉండే వస్తువులు

సర్వం సిద్ధం చేశాం

పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. తొలి రోజే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశాం. తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు 17వ తేదీ వరకూ ఒంటి పూట బడులు నిర్వహిస్తాం. ప్రతి విద్యార్థి చక్కగా స్కూలుకు వెళ్లి చదువుకోవాలి. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి.

– రంగస్వామి, ఇన్‌చార్జ్ డీఈఓ

నేడు 'స్పందన'

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి 'స్పందన' కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. డివిజన్, మండల స్థాయిలో సైతం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వినతి పత్రంపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు 'స్పందన'కు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న పి.ఆరోహణరావును ధర్మవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా అటాచ్ చేశారు. ధర్మవరం రూరల్ సర్కిల్ నుంచి ఎస్.మన్సూరుద్దీన్‌ని వీఆర్‌కు పంపించారు. పుట్టపర్తి రూరల్ సర్కిల్‌లో పని చేస్తున్న జయనాయక్‌ను తిరుపతి వెస్ట్ అర్బన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. తిరుపతి వెస్ట్ అర్బన్ సీఐ వి.శివప్రసాద్‌ను వీఆర్‌కు పంపించారు. చిత్తూరు డీసీఆర్‌బీ సీఐ శరత్‌చంద్రను తిరుపతి 'దిశ' పోలీసు స్టేషన్ సీఐగా బదిలీ చేశారు. తిరుపతి 'దిశ' సీఐ రసూల్ సాహేబ్‌ను వీఆర్‌లో ఉంచారు. అనంతపురంలో వీఆర్‌లో ఉన్న రాజేంద్రనాథ్ యాదవ్‌ను నల్లమాడ సర్కిల్‌కు బదిలీ చేశారు. నల్లమాడ సీఐ నిరంజనరెడ్డిని వీఆర్‌కు పంపించారు. వీఆర్‌కు వెళ్లిన వారు ఎస్పీల వద్ద రిపోర్ట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా

- ప్రతి ఆస్పత్రిలో వైద్యసేవలపై సర్కారు ప్రత్యేక దృష్టి
- ప్రతినెలా ఆరు ఆస్పత్రులను డీఎంహెచ్‌ఓ తనిఖీ చేయాల్సిందే
- నోటిఫైడ్ డిసీజ్‌లను విధిగా ఆన్‌లైన్‌లో పెట్టాలి
- హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌కు అనుసంధానం చేయాలి
- డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించుకోని ఆస్పత్రులపై చర్యలు
- ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న ప్రైవేటు నర్సింగ్ హోంలు, ఆస్పత్రులు, క్లినిక్‌లు ఇలా ప్రతి ప్రైవేటు ఆస్పత్రిపై నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఆస్పత్రులే కాదు ప్రైవేటు ఆస్పత్రులు కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నది దీని ముఖ్య ఉద్దేశం. కొన్ని ఆస్పత్రులు వైద్యసేవలపై బాధితులతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వివరాలు ఇవ్వకపోవడం చేస్తున్నాయి. దీంతో ఇకపై నిత్యం పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశించారు.

డీఎంహెచ్‌ఓ పర్యవేక్షణ కీలకం..

డీఎంహెచ్‌ఓ ప్రతి నెలా జిల్లాలో ఆరు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. తనిఖీ చేసిన ఆస్పత్రుల నివేదికను కుటుంబ సంక్షేమశాఖ పోర్టల్‌కు అనుసంధానించాలి. డీఎంహెచ్‌ఓతో పాటు మరో బృందం కూడా ఉంటుంది. ఈ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి. ప్రైవేటు వ్యక్తుల నుంచి నర్సింగ్‌హోంల మీద వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలి. డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోని ఆస్పత్రులపై చర్యలు తీసుకోనున్నారు.



స్నేహలత ఆస్పత్రిలో సేవలపై డాక్టర్‌ను విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి (ఫైల్)

ఇష్టారాజ్యంగా డెంగీ వైద్యం కుదరదు..

డెంగీ వ్యాధి అనేది నోటిఫైడ్ డిసీజ్. ఈ వ్యాధి సోకినప్పుడు ప్రైవేటు ఆస్పత్రులు తప్పకుండా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలి. కానీ అలా చేయకుండా ఏ జ్వరమైనా డెంగీగా చిత్రీకరించడం, ప్లేట్‌లెట్‌లు తగ్గాయని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి వైరల్ ఫీవర్‌కు కూడా ప్లేట్‌లెట్‌లు తగ్గడం సహజం. కానీ ప్రైవేటు ఆస్పత్రుల్లో దీనిపై దోపిడీ జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకపై ఇలా చేసిన ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. డెంగీ నిర్ధారణ రక్తపరీక్షల ద్వారానే కాదు, జీజీహెచ్‌లో ఎలీసా టెస్టులో నిర్ధారణ అయితేనే దాన్ని డెంగీగా పరిగణించాలి. కానీ ప్లేట్‌లెట్‌లు తగ్గగానే డెంగీగా చిత్రీకరిస్తున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల వివరాలు ఇలా

కేటగిరీ	సంఖ్య
పాలి క్లినిక్స్	6
20 పడకల నర్సింగ్‌హోంలు	111
50 పడకల లోపు నర్సింగ్‌హోంలు	31
100 పడకల లోపు ఆస్పత్రులు	15
200 పడకల లోపు ఆస్పత్రులు	4
200 పడకలు దాటిన ఆస్పత్రులు	2
డయాగ్నస్టిక్ సెంటర్లు	81
హైఎండ్ డయాగ్నస్టిక్ సెంటర్లు	6

ప్రైవేటు ఆస్పత్రులపై వస్తున్న ఫిర్యాదులివే

- నోటిఫైడ్ డిసీజ్‌ల వివరాలు అంటే డెంగీ మొదలుకొని టీబీ వరకు బాధితుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడం లేదు
- ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండడం
- జనన ధ్రువీకరణ వివరాలు పోర్టల్‌లో నమోదు చేయకపోవడం
- సరైన కారణాలు లేకుండా అబార్షన్లు చేయడం
- డెంగీ చికిత్సకు భారీగా డబ్బు వసూలు చేయడం
- ఆరోగ్యశ్రీ సేవలకు రోగుల నుంచి డబ్బు వసూలు చేయడం
- కాన్పు సమయంలో తల్లుల మృతి పట్ల సరైన కారణాలు చూపకపోవడం.

ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం



ప్రాణాంతక మలేరియా, డెంగీ, టీబీ, మ్యూకోమైకోసిస్ (బ్లాక్ ఫంగస్), హ్యూమన్ రేబిస్, టైఫాయిడ్ వివరాలు ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఐహెచ్ఐపీ)లో, అబార్షన్స్, డెలివరీలు, ఆపరేషన్ వివరాలను హెల్త్ మెడికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్)లో నమోదు విషయమై ప్రైవేట్ నర్సింగ్ హోంలను తనిఖీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆస్పత్రులు వివరాల నమోదులో నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు జారీ చేసి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తాం.

– డాక్టర్ యుగంధర్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్

ఫోన్ కాల్ వద్దు.. వాట్సాప్ ముద్దు!

- సాధారణ ఫోన్ కాల్ మాట్లాడేందుకు అధికారుల్లో జంకు
- ఏది మాట్లాడినా వైరల్ చేస్తారనే భయం!
- లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లయీస్, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికం

✧ హిందూపురానికి చెందిన కుమార్ పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పని నిమిత్తం ఇటీవల పుట్టపర్తి వచ్చాడు. అక్కడ తనకు కావాల్సిన ఉద్యోగి లేకపోవడంతో సిబ్బందితో ఆయన ఫోన్ నంబర్ తీసుకున్నాడు. ఇంటికి వచ్చాక కాల్ చేయగా.. ఫోన్ లిఫ్ట్ చేసిన సదరు ఉద్యోగి వెంటనే వాట్సాప్‌లోకి రమ్మని కోరాడు. తనకు స్మార్ట్‌ఫోన్ లేదని కుమార్ చెబితే, నేరుగా కార్యాలయానికి వచ్చి మాట్లాడాలంటూ కట్ చేశాడు.

✧ కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఓ హోటల్‌లో వాటర్ బాటిళ్లను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు అనిల్ అనే వ్యక్తి లీగల్ మెట్రాలజీ విభాగంలోని ఓ అధికారికి కాల్ చేశాడు. అనిల్ విషయాన్ని చెబుతుండగానే కాల్ కట్ చేసిన అధికారి.. ఆ తర్వాత కొంత సేపటికే అనిల్‌కు సాధారణ ఫోన్ కాల్ కాకుండా వాట్సాప్ ద్వారా కాల్ చేసి మాట్లాడారు.

✧ ధర్మవరం మండలం గుట్టూరుకు చెందిన సోమశేఖర్ గత నెలలో ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. సోమశేఖర్ చొక్కా జేబులో స్మార్ట్‌ఫోన్ గుర్తించిన అక్కడి కానిస్టేబుల్ ఒకరు.. దాన్ని బయట పెట్టి లోపలికి రావాలని హెచ్చరించాడు. ఇందులో ఏముందని ప్రశ్నిస్తే.. వీడియో రికార్డు చేస్తారనే ఉద్దేశంతో లోపలికి అనుమతించబోమని కానిస్టేబుల్ స్పష్టం చేశాడు.

సాక్షి, పుట్టపర్తి: ఇటీవల కాలంలో ఆడియో రికార్డింగ్ కాల్స్ వైరల్ చేయడం సరదాగా మారింది. మాటలు రికార్డు చేసి అందులో ఎవరి గురించి అయినా తప్పుగా మాట్లాడితే వైరల్ చేస్తున్నారు. మద్యం సేవించేటప్పుడు చేసే హంగామానూ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచిన దాఖలాలు ఉన్నాయి. ఫలితంగా చాలా మంది ఫోన్ కాల్ మాట్లాడాలంటేనే జంకుతున్నారు. జేబుల్లో స్మార్ట్‌ఫోన్‌ను చూస్తే బెదిరిపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బందిలో ఈ గుబులు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. సాధారణ పౌరులెవరైనా చొక్కా జేబులో ఫోన్ ఉంచుకుని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే ముందు దాన్ని బయట పెట్టి లోపలికి రావాలనే షరతు విధిస్తున్నట్లు సమాచారం. ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఓ ఉద్యోగికి ఇటీవల ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫోన్ చేసి ఏదో సమాచారం కోరగా.. వాట్సాప్ కాల్ చేసి మాట్లాడాలని సదరు ఉద్యోగి సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.



వాట్సాప్ కాల్ అయితే సేఫ్!

వాయిస్ కాల్‌లో మాట్లాడితే రికార్డు చేస్తారనే భయంతో.. ఏ రికార్డింగ్ చేయలేని వాట్సాప్ కాల్‌లో మాట్లాడేందుకు మొగ్గు చూపుతున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కేవలం వాట్సాప్‌లోనే సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నట్లు తెలిసింది. ప్రజలతో ఎక్కువగా సంబంధాలు ఉండే డ్వామా, సివిల్ సప్లయీస్,సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్, ఐసీడీఎస్‌లో జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి కార్యాలయాల వరకూ ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

ముగిసిన 'బాలవికాస్' స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న బాలవికాస్ పాఠశాలల విద్యార్థులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో మూడు రోజులుగా జరుగుతున్న సత్యసాయి బాలవికాస్ పూర్వ విద్యార్థుల స్నాతకోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా విశాఖపట్టణానికి చెందిన శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థుల బ్రాస్ బ్యాండ్ వాయిద్యం నడుమ సత్యసాయి సేవా సంస్థల మహిళా విభాగం జాతీయ కోఆర్డినేటర్లు, వివిధ రాష్ట్రాలకు చెందిన గురువులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చక్రవర్తి, నిమిష్ పాండ్యలు బహుమతులు ప్రదానం చేశారు. సత్యసాయి బోధనల ఆధారంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన పూర్వ విద్యార్థులకు బహుమతులు అందించారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్‌జే రత్నాకర్, నిమిష్ పాండ్య

ప్రతిభకు ప్రోత్సాహం

- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు నగదు పురస్కారం
- 'జగనన్న ఆణిముత్యాలు' కింద ప్రతి పాఠశాల నుంచి ముగ్గురి ఎంపిక
- తల్లిదండ్రులు, హెచ్‌ఎంలకూ సత్కారం

ప్రశాంతి నిలయం: పదోతరగతి పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించి ర్యాంకర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల స్థాయి నుంచి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించనున్నారు. దీంతో పాటు ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించనున్నారు. పాఠశాల స్థాయిలో జూన్ 12 నుంచి 19 వరకూ స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో హెచ్‌ఎంలు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమం నిర్వహించనున్నారు. మార్కుల పరంగా ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున అందిస్తారు. ఈ నెల 15న నియోజకవర్గ స్థాయిలో, 17న జిల్లా స్థాయిలో, 20న రాష్ట్ర స్థాయిలో ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన ముగ్గురికి నగదు ప్రోత్సాహకంతోపాటు మెమొంటో అందజేయనుండగా.. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి కింద రూ.15,000, రెండో బహుమతి రూ.10,000, మూడో బహుమతి రూ.5000, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి కింద రూ.50,000, రెండో బహుమతి రూ.30,000, మూడో బహుమతిగా రూ.15,000 అందిస్తారు. ఇక.. ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల్లో ప్రతి గ్రూప్ నుంచి ఒకరిని గుర్తించి నియోజకవర్గ స్థాయిలో రూ.15,000, జిల్లా స్థాయిలో రూ.50,000 అందజేస్తారు. 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమ నిర్వహణకు పాఠశాలల్లో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

హిందూపురం: నిర్మాణ రంగ సంబంధిత అంశాలపై ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండి 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ యువతీ, యువకులకు ఎలక్ట్రీషియన్ శిక్షణ, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి ల్యాండ్‌సర్వేయర్ కోర్సుల్లో శిక్షణ కల్పిస్తామన్నారు. హిందూపురం ముక్కిడిపేటలోని పాత ఎస్సీ బాలుర హాస్టల్‌లో రోజూ 4 గంటల చొప్పున 70 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం సర్టిఫికెట్ అందించి ప్రయివేట్, ప్రభుత్వ నిర్మాణరంగ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వివరాలకు నంబర్ 9908620306లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నేటి నుంచి జెడ్పీటీసీలకు మూడో విడత శిక్షణ

అనంతపురం సిటీ: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వేదికగా సాగుతున్న జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుల(జెడ్పీటీసీ)కు సోమవారం నుంచి మూడో బ్యాచ్ (చివరి బ్యాచ్) సభ్యులు హాజరు కానున్నారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకోగా, చివరి విడతగా మూడ్రోజుల పాటు కొనసాగే శిక్షణ తరగతులకు.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 25 మంది జెడ్పీటీసీ సభ్యులు హాజరు కానున్నారు. వీరిలో అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, గుమ్మఘట్ట, గుంతకల్లు, పెద్దవడుగూరు, రాయదుర్గం, విడపనకల్లు, యల్లనూరు, ధర్మవరం, హిందూపురం, లేపాక్షి, నల్లమాడ, డి.హీరేహాళ్, గుత్తి, శింగనమల, యాడికి, బత్తలపల్లి, చిలమత్తూరు, నంబులపూలకుంట, పుట్టపర్తి, తాడిమర్రి, తలుపుల, తనకల్లు, అగళి, సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వీరంతా ఆదివారం రాత్రే శ్రీకాళహస్తికి బయలుదేరి వెళ్లారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో గుమికూడిన ప్రజలు

బత్తలపల్లి: టిప్పర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన తరికి రామకృష్ణ (47) ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై తన పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా పోట్లమర్రి వృద్ధాశ్రమం సమీపంలో ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీ కొంది. ఘటనలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదం గురించి తెలుసుకున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, విద్యార్థి విభాగం నాయకుడు నరేంద్రరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, సుధాకరరెడ్డి తదితరులు ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకుని రామకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులున్నారు. వీరిలో ఒకరు ఆర్మీలో పనిచేస్తున్నారు. మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు.

అసైన్డ్ భూములు.. అన్యాక్రాంతం!



అసైన్డ్ భూముల్లో ఆగి ఉన్న కంటైనర్లు



గోనిపేట వద్ద అసైన్డ్ భూమిలో ఏర్పాటు చేసిన ధాబా



దుద్దేబండ సమీపంలో అసైన్డ్ భూమిలో ఏర్పాటు చేసిన హోటళ్లు

అవి పేదల కోసం ప్రభుత్వం ఇచ్చిన భూములు. వాటిలో పంటలు సాగు చేసుకుని వచ్చే ఆదాయంతో జీవనం సాగించాలనే ఉన్నతాశయంతో సర్కారు అందించింది. అయితే, ఎంతో సదుద్దేశంతో కట్టబెట్టిన అలాంటి భూములు నేడు అన్యాక్రాంతమవుతున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లకు నిలయంగా మారుతున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండానే ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్న బడాబాబులు.. అధికారులు నోటీసులనూ ఖాతరు చేయడంలేదు.

- బడాబాబుల పాలవుతున్న అసైన్డ్ భూములు
- హోటళ్లు, రెస్టారెంట్లకు నిలయంగా మారిన వైనం
- అనుమతుల్లేకుండానే యథేచ్ఛగా ఏర్పాటు
- అధికారుల నోటీసులూ బేఖాతరు

పెనుకొండ రూరల్: పెనుకొండ కియా పరిశ్రమ సమీపంలో ఉన్న అసైన్డ్ భూములు బడాబాబులకు వరంగా మారాయి. ప్రభుత్వం పేదలకు అందజేసిన వ్యవసాయ భూములను వాణిజ్య కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు. కియాకు కూతవేటు దూరంలో దుద్దేబండ క్రాస్ సమీపంలోని యర్రమంచి పొలం సర్వే నంబర్ 20–7లో అసైన్డ్ భూమి 2.89 ఎకరాల్లో రెండు పెద్ద హోటళ్లు వెలిశాయి. అలాగే జాతీయ రహదారిపై గోనిపేట మలుపు వద్ద రాంపురం రెవెన్యూ గ్రామ పొలంలోని సర్వే నంబర్ 243–1బీ, 243–2ఏలోని దాదాపు ఎకరం స్థలంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ధాబాను నిర్మించారు. కియా చుట్టుపక్కల దాదాపు పది ఎకరాల మేర అసైన్డ్ భూములను ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. పేదల భూములను అతి తక్కువకు స్వాధీనం చేసుకుని లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

అనుమతుల్లేకుండానే..

అసైన్డ్ భూములను ఇతర కార్యకలాపాలకు ఉపయోగించాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీకి కొంత మేర చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అయితే, నిబంధనలను తోసిరాజని ఇష్టారాజ్యంగా పెద్ద పెద్ద భవనాలు నిర్మించి వ్యాపారులు చేసుకుంటున్నారు. పంచాయతీ నుంచి అనుమతులు పొందకుండా సర్కారు ఖజానాకు సైతం గండి కొడుతున్నారు. అధికారులు నోటీసులు జారీచేస్తున్నా సదరు రెస్టారెంట్ల నిర్వాహకులు లెక్కచేయడం లేదు.

దుమ్మూ ధూళితో మరిన్ని అవస్థలు

కియా పరిశ్రమకు నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. అలా వచ్చే వాహనాల డ్రైవర్లు రెస్టారెంట్ల వద్ద భోజనం చేసేందుకు ఆగుతున్నారు. రోడ్ల పక్కన భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఇప్పటికే అనేక సార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీనికితోడు అధిక టన్నేజీ గల కంటైనర్లతో రోడ్లు దెబ్బతింటున్నాయి. దుమ్మూ ధూళి జాతీయ రహదారిపై పేరుకుపోతోంది.

చర్యలు తీసుకుంటాం..



అసైన్డ్ భూముల్లో ఏర్పాటు చేసిన ధాబాలను పరిశీలించి నోటీసులు జారీ చేస్తాం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసి ఉంటే తగిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి వారి నుంచి రావాల్సిన పన్నులనూ వసూలు చేస్తాం.

– స్వర్ణలత, తహసీల్దార్, పెనుకొండ

ఊపిరి పోసిన '108'

చిలమత్తూరు: రాష్ట్రంలో ప్రజలకు సత్వర వైద్యసేవలు అందించేందుకు జగన్ సర్కార్ ఆధునీకీకరించిన 108 అంబులెన్స్.. అత్యవసర పరిస్థితిలో ఉన్న ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడింది. వివరాలు... గోరంట్ల మండలం తూనేపల్లికి చెందిన చౌడప్ప ఆదివారం ఉదయం స్థానిక జాతీయ రహదారిపై ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడుతూ కూలబడ్డాడు. అదే సమయంలో అటుగా వచ్చిన రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దనరెడ్డి.. చౌడప్ప పరిస్థితిని గమనించి వెంటనే తన కారులో కొడికొండ చెక్‌పోస్టులోని ఆర్‌ఎంపీ విశ్వనాథరెడ్డి వద్దకు చేర్చారు. రోగి పరిస్థితిని గమనించగానే గుండెపోటుకు గురైనట్లు గుర్తించిన ఆర్‌ఎంపీ విశ్వనాథరెడ్డి ఓ వైపు ప్రథమ చికిత్స నిర్వహిస్తూ మరోవైపు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ నాగరాజు, పైలెట్ ఫరీద్ అక్కడకు చేరుకుని చౌడప్పకు ఆక్సిజన్ అమర్చి హిందూపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు సమాచారం. సకాలంలో రోగికి ప్రథమచికిత్స అందించిన ఆర్‌ఎంపీ విశ్వనాథరెడ్డిని, ఆగమేఘాలపై స్పందించి రోగి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది సేవలను ఈ సందర్భంగా స్థానికులు కొనియాడారు. టీడీపీ హయాంలో నిర్వీర్యమైన 108 అంబులెన్స్ సేవలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆధునీకరించడం వల్లనే నేడు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు ప్రాణాలతో బయటపడుతున్నారన్నారు.



చౌడప్పను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న 108 సిబ్బంది

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసైన ఓ ఏఆర్ కానిస్టేబుల్ సర్వమూ కోల్పోయి అప్పుల పాలయ్యాడు. చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. నార్పలకు చెందిన అనిల్‌కుమార్ శ్రీసత్యసాయి జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. కాగా, సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో అనిల్ కుమార్ ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో తెలిసిన వారితో అప్పులు చేస్తూ వచ్చాడు. అవి కాస్త వడ్డీలకు వడ్డీలు పేరుకుపోయి పెనుభారంగా మారాయి. కానిస్టేబుల్ అనే ఒకేఒక్క కారణంతో వడ్డీ వ్యాపారులు సైతం మిన్నకుండిపోయారు. చివరకు అప్పు తీర్చాలంటూ కొంత కాలంగా వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. పరిస్థితి చెయ్యి దాటిపోతుండడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక చివరకు ఆత్మహత్యాయత్నం చేసినట్లు నార్పల పోలీసులకు బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని బాలుడి మృతి

మడకశిర: అగళి మండలంలోని ఇరిగేపల్లి వద్ద ఆదివారం సాయంకాలం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందాడు. మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం హుల్లేకెరగొల్లహట్టి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి కుమారులు వేణు(16 , భరత్ ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇరిగేపల్లికి బయలుదేరారు. ఇరిగేపల్లి గ్రామ పొలిమేరలోకి చేరుకోగానే వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న వేణు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన తమ్ముడు భరత్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వేణు మృతదేహం పడి రోదించిన తీరు చూపరులను కంట తడిపెట్టించింది. ఘటనపై ఎస్‌ఐ లావణ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



వేణు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మరణంలోనూ వీడని బంధం

వారిద్దరూ భార్యాభర్తలు.. రోజూ కలిసే కూలి పనికి వెళ్లే వారు.. ఒకరికొకరు తోడూ నీడగా బతికారు.. ఉన్నంతలో ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తున్నారు. కానీ, అనుకోని రోడ్డు ప్రమాదం ఆ దంపతులిద్దరినీ బలి తీసుకుంది. భార్య అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త కూడా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...



సరోజమ్మ (ఫైల్)



ఓబులపతి(ఫైల్)

- తోడూనీడగా బతికి.. మరణంలోనూ ఒకటై!
- రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి
- రాప్తాడు మండలంలో ఘటన
- మామిళ్లపల్లిలో విషాదం
- అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు

రాప్తాడు: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన ఓబులపతి (41), సరోజమ్మ (35) దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సరోజమ్మకు గ్రామ వలంటీర్‌గా పనిచేసే అవకాశం దక్కింది. దీంతో తనకు కేటాయించిన గృహాలను తరచూ సందర్శిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ వచ్చింది. దీంతో సరోజమ్మ కుటుంబంపై గ్రామంలో ఆదరాభిమానాలు పెరిగాయి.

మృత్యువై దూసుకొచ్చిన లారీ..

అనంతపురంలో ఉంటున్న తమ బంధువులను కలిసేందుకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఓబులపతి, సరోజమ్మ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రాప్తాడు గ్రామాన్ని దాటిన తర్వాత అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్టేడియం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మహా సిమెంట్స్ కంపెనీకి చెందిన లారీ ఢీకొంది. లారీ కుడి వైపు టైర్లు ద్విచక్ర వాహనంపై ఎక్కి వెళ్లడంతో సరోజమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఓబుళపతిని స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన కూడా మృతిచెందాడు. గంట వ్యవధిలోనే భార్య, భర్త మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. విషయం తెలియగానే మామిళ్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై రాప్తాడు ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామగిరి: మండలంలోని ఎగువపల్లి చెక్‌పోస్ట్ సమీపంలో ఆదివారం వేకువజామున కర్ణాటక మద్యం పట్టుబడింది. ఈ మేరకు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. జిల్లా లోని కర్ణాటక సరిహద్దులో వాహనాల తనిఖీని చేపట్టిన సమయంలో తిరుమణి నుంచి వస్తున్న కారును ఆపి నలుగురిలో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా 15 కేసుల కర్ణాటక మద్యం లభ్యమైంది. పట్టుబడిన వారిలో అనంతపురానికి చెందిన చాకలి ఆదినారాయణ, తోట వెంకటరమణ ఉన్నారు. పరారైన వారిని న్యామద్దలకు చెందిన మహేష్, తిరుమణికి చెందిన బార్ యజమానిగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

హిందూపురం: ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురం పట్టణానికి చెందిన ఓ యువతి డిప్లొమా చేస్తోంది. ఈ క్రమంలో ముక్కిడిపేట ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఆకీఫ్ ఆమెతో పరిచయం ఏర్పరుచుకుని తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. తాను ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని నమ్మించాడు. కొంత కాలం క్రితం యువతి తండ్రి చనిపోయాడు. తల్లి చిరుద్యోగిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ నేపథ్యంలో తల్లి తన ఉద్యోగానికి వెళ్లిన సమయంలో ఇంట్లో చొరబడి యువతి వద్దన్న వినకుండా పెళ్లి చేసుకుంటానని ఒట్టు వేసి మాయమాటలతో ఆమెను శారీరకంగా లోబర్చుకున్నాడు. ఇటీవల తాను గర్భం దాల్చడంతో విషయం మహమ్మద్ ఆకీఫ్‌కు తెలిపి వెంటనే పెళ్లి చేసుకుందామని ప్రాధేయపడింది. దీనిపై ఆకీఫ్ మండిపడ్డాడు. తల్లి, కుమార్తెను దుర్భాషలాడుతూ పెళ్లి అని వెంటబడితే అంతు చూస్తానని బెదిరించాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. అదే సమయంలో ఇంటికి చేరుకున్న తల్లి వెంటనే కుమార్తెను కాపాడి ఆస్పత్రికి తీసుకెళ్లింది. ప్రస్తుతం యువతి పరిస్థితి మెరుగు పడుతున్నట్లు సమాచారం. ఘటనపై హిందూపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, అంగన్‌వాడీ సంఘం నాయకురాలు లావణ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సీపీఎం నాయకులు రాము, జగదీష్, రామకృష్ణ తదితరులు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. అనంతరం డీఎస్పీ కంజాక్షన్‌ను కలసి బాధితురాలికి న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



చికిత్సపొందుతున్న యువతి

అడుగంటిన తుంగభద్ర జలాశయం

- 5 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

బొమ్మనహాళ్: ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల వరదాయినిగా భాసిల్లుతున్న తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. ప్రస్తుతం కేవలం 5.100 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 2,635 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 40.220 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. డ్యాంలో ప్రస్తుతం 1581.07 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. ఆదివారం ఇన్‌ఫ్లో 341 క్యూసెక్కులుగా నమోదైంది. కాగా, టీబీ డ్యాంకు గతేడాది మే నెలలో భారీగా వరద నీరు చేరడంతో జూలైలో పూర్తిస్థాయిలో నిండి పలుమార్లు 33 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం జలాశయం ఉపరితల ప్రాంతాల్లో వర్షాలు మొదలు కాకపోవడంతో నీరు లేక డ్యాం బోసిపోయింది.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య



హిందూపురం అర్బన్: రైలు కిందపడి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపారు. ఆదివారం ఉదయం హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లక్ష్యం కాలేదు. మృతుడికి 70 ఏళ్ల వయసుంటుంది. పరిగి మండలానికి చెందిన వ్యక్తిగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆచూకీ తెలిసిన వారు హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించవచ్చు.

పాముకాటుతో వ్యక్తి మృతి




నరసింహప్ప మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: మండలంలోని ఊటుకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, స్థానిక వార్డు సభ్యురాలు అంజినమ్మ భర్త నరసింహప్ప పాము కాటుతో మృతి చెందారు. గత శనివారం రాత్రి ఇంటి వద్ద గడ్డివామి నుంచి పశువులకు మేత తీస్తుండగా అందులో దాగి ఉన్న పాము కాటు వేసింది. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న నరసింహప్పను కుటుంబసభ్యులు గమనించి బంధువుల సహకారంతో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆదివారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హిందూపురంలోని ఆస్పత్రికి వెళ్లి నరసింహప్ప మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ సవిత, సర్పంచ్ దిలీప్‌కుమార్ యాదవ్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహామూర్తి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కణేకల్లులో 120 ఏళ్ల తర్వాత ఊరి దేవర

కణేకల్లు: పట్టణంలో 120 ఏళ్ల తర్వాత ఊరి దేవర నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. గ్రామంలో ప్రజలు పాడిపంటలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ జాతరకు అవసరమైన అన్నీ ఏర్పాట్లను గ్రామపెద్దలు పూర్తి చేశారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ మూడ్రోజుల పాటు దేవర జరుగనుంది. ఇందుకోసం గ్రామ దేవత దేవమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శతాబ్దం తర్వాత జరిగే ఈ వేడుకకు భారీ సంఖ్యలో జనం రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6గంటలకు వేదవతి హగిరిలో గంగపూజ చేసి కలశాలతో కణేకల్లులో ఊరేగింపు చేయనున్నారు. అనంతరం ఆలయంలో నవగ్రహ పూజ, గట్టెమ్మ పూజ, మహా మంగళారతి పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం దేవమ్మ, కొల్లాపురమ్మ దేవతల విగ్రహాల ఊరేగింపు జరుగనుంది. 13న దేవమ్మ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, వడి బియ్యం సమర్పణ ఉంటుంది.రాత్రి 11 గంటల నుంచి బోనాలతో అమ్మవారికి విశిష్ట పూజలు చేయనున్నారు. అదే రోజు అర్ధరాత్రి దాటాక ఆలయం వద్ద అమ్మవారి దేవర పోతును బలివ్వనున్నారు. 14న ఆలయంలో ప్రత్యేక పూజలు, ఇళ్ల వద్ద విందు కార్యక్రమాలు ఉంటాయి.

కారు ఢీకొని వివాహిత మృతి



రమణమ్మ (ఫైల్)

కొత్తచెరువు: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువులోని ప్రభుత్వాస్పత్రి వద్ద నివాసముంటున్న సూరి, తన భార్య రమణమ్మ, కుమార్తె సాయిప్రియతో కలసి మండలంలోని వేములేటిపల్లిలో ఆదివారం జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ధర్మవరం రహదారిలోని ఎస్‌ఎల్వీ ఫంక్షన్ హాలు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం వేగం తగ్గించారు. అదే సమయంలో వెనుక వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో సూరి కుటుంబం మొత్తం తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రులను వెంటనే పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రమణమ్మ (29) మృతి చెందింది. సూరి, సాయిప్రియకు కాళ్లు విరిగాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు.